క్లుప్తంగా

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

వై.రామవరం: మండలంలోని అన్ని గ్రామాల్లో శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు విద్యుత్‌శాఖ ఈఈ టి.గ్రాబియేల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫీడర్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతు పనులతో పాటు విద్యుత్ తీగలపై ఉన్న చెట్ల కొమ్మలు నరికివేత పనులు చేస్తుండడంతో ఆయా సమయాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత


అవగాహన కల్పిస్తున్న అధ్యాపకుడు రవీంద్రనాయక్

చింతపల్లి: స్థానిక డిగ్రీ కళాశాలలో పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులకు బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కెమిస్ట్రీ అధ్యాపకుడు రవీంద్రనాయక్ మాట్లాడుతూ ఓజోన్ పొర ఆవశ్యకతను వివరించారు.

భూమండలంపై క్లోరోఫ్లోర్ కార్బన్ల శాతం పెరిగి ఓజోన్‌పొర దెబ్బతినడంతో సూర్యుడు నుంచి వెలువడే అల్ట్రావైలెట్ కిరణాలు భూమిని తాకడం వలన జీవరాశులకు శారీరక రుగ్మతలు కలుగుతాయన్నారు.ఓజోన్ పొరను కాపాడుకోవడం అందరి బాధ్యత అన్నారు. ఇందులో భాగంగా పర్యావరణ పరిక్షణకు అందరూ సహకరించాలన్నారు. అధ్యాపకులు డాక్టర్ వి.రమణ, డాక్టర్ కెజియా రాణి, శ్రావణి, లీలాపావని, ఎన్ఎస్ఎస్ పీవోలు తదితరులు పాల్గొన్నారు.

గ్రామంలో పారిశుధ్య పనులు


డ్రైనేజీ పనులు పర్యవేక్షిస్తున్న కితలంగి సర్పంచ్ సుబ్బారావు

దుంబ్రిగుడ: మండలంలోని కితలంగి పంచాయతీ పాడి గ్రామంలో సర్పంచ్ వి.సుబ్బారావు ఆధ్వర్యంలో పారిశుధ్య పనులు చేపట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ పాడి గ్రామంలో తాగునీరు ట్యాంక్‌తో పాటు డ్రైనేజీలు శుభ్రం చేశారు. గ్రామంలోని మౌలిక సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. పంచాయతీ సిబ్బందికి గ్రామస్తులు మద్దతు తెలిపారన్నారు.

300 మందికి వైద్య పరీక్షలు


కిండ్ర గ్రామంలో వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ వెంకటలక్ష్మి

రాజవొమ్మంగి: మండలంలోని కిండ్ర గ్రామంలో ఎంపీపీ గోము వెంకటలక్ష్మి నేతృత్వంలో గోరవరానికి చెందిన ఆదిత్య మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో బుధవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఇందులో భాగంగా లబ్బర్తి, లాగరాయి, కిండ్ర తదితర గ్రామాలకు చెందిన సుమారు 300 మందికి ఈ శిబిరంలో వైద్య పరీక్షలు చేసి, మందులు అందజేసినట్టు ఎంపీపీ వెంకటలక్ష్మి తెలిపారు. డాక్టర్ జార్జ్ ముల్లార్, డాక్టర్ మోహన్, మార్కెటింగ్ మేనేజర్ సతీష్‌బాబు, సర్పంచ్‌లు బూసరి సత్యనారాయణ, మిరియాల గణలక్ష్మి, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

డ్రాగన్ ఫ్రూట్ మొక్కల పంపిణీ


దారకొండలో మొక్కలు పంపిణీ చేస్తున్న సిబ్బంది

సీలేరు: గిరిజన రైతు లాభాలు వచ్చే వ్యవసాయం చేసి ఆర్థికంగా ఎదగాలని ఉపాధి ఏపీవో రాంప్రసాద్ చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూగిరిజన రైతులకు డ్రాగన్ ఫ్రూట్ మొక్కలను పంపిణీ చేస్తున్నామన్నారు. ఇప్పటికే మండలంలోని 16 పంచాయతీల్లో 95 మంది రైతులకు 85,500 మొక్కలను అందజేశామన్నారు. ఇందులో భాగంగా దారకొండ పంచాయతీలో ఐదు రైతులకు 4,500 మొక్కలు. దుప్పులవాడ 3 రైతులకు 2700 మొక్కలు. గుమ్మరేవులులో 6 రైతులకు 5400 మొక్కలు టెక్నికల్ అసిస్టెంట్ పృథ్వీ. ఫీల్డ్ అసిస్టెంట్ గురునాథ్ ద్వారా రైతులకు పంపిణీ చేశామన్నారు. రెండేళ్లలో జాగ్రత్తగా పంటను కాపాడుకుంటే లక్షలాది రూపాయల ఆదాయం వస్తుందని, ప్రస్తుత మార్కెట్లో డ్రాగన్ ఫ్రూట్‌కి గిరాకీ ఉందని ఏపీవో రాంప్రసాద్ చెప్పారు.


లబ్బూరులో అవగాహన ర్యాలీలో పాల్గొన్న వైస్ ఎంపీపీ భాగ్యవతి, సిబ్బంది


దుంబ్రిగుడలో మాట్లాడుతున్న వైద్యులు, వేదికపై జెడ్పీటీసీ జానకమ్మ


రాజేంద్రపాలెంలోని వైద్య శిబిరానికి హాజరైన విద్యార్థినులు

ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం

- గ్రామాల్లో మహిళలకు వైద్య పరీక్షలు
- ఆరోగ్య భద్రతపై అవగాహన

పెదబయలు: జిల్లా వ్యాప్తంగా నారీ సశక్త్ పరివార్ అభియాన్ (ఎస్ఎన్ఎస్‌పిఏ) కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఇందులో భాగంగా గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించి, మహిళలు, గర్భిణులు, బాలింతలకు వైద్య పరీక్షలు చేశారు. ఆరోగ్య భద్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు, గైనకాలజిస్టులు తదితరులు ఆరోగ్యంపై పలు సూచనలిచ్చారు. మహిళలకు ప్రబలే వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆరోగ్యవంతమైన మహిళలతోనే ఆ కుటుంబం బలమైనదిగా ఎదుగుతుందన్నారు. గర్భిణులు క్రమం తప్పకుండా వైద్యపరీక్షలు చేయించుకోవాలని సూచించారు. గర్భిణులు తప్పనిసరిగా ఆస్పత్రుల్లోనే ప్రసవాలు చేయించుకోవాలని, దీంతో తల్లి, బిడ్డ సురక్షితంగా ఉంటారన్నారు. గర్భిణులు వ్యాక్సినేషన్ వేయించుకోవాలని సూచించారు. క్యాన్సర్ వంటి వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. మూడు వారాల దగ్గు ఉంటే తప్పకుండా క్షయ పరీక్షలు చేయించుకోవాలన్నారు. వైద్యుల సూచనల మేరకు మందులు వినియోగించాలని సూచించారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఆరోగ్య సమస్యలు తలెత్తితే తక్షణమే వైద్య సిబ్బందిని సంప్రదించాలన్నారు. పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని, రోజూవారీ ఆహారంలో పోషకాహారాలు ఉండేలా చూసుకోవాలని సూచించారు. వ్యక్తిగత, పరిశుభ్రత పాటించాలన్నారు. మహిళలు, కౌమార దశలో ఉన్న బాలికలకు రుతుక్రమ పరిశుభ్రత, పోషకారం ప్రాధాన్యతను వివరించారు. కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన వైద్య శిబిరాల్లో మహిళలకు స్క్రీనింగ్ పరీక్షలు చేశారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వాడవాడలా ఆరోగ్యభద్రతపై అవగాహన ర్యాలీలు నిర్వహించి, పోస్టర్లు ఆవిష్కరించారు.


మంగబందలో వైద్య సిబ్బందితో పాడేరు ఏడీఎంహెచ్‌వో డాక్టర్ ప్రతాప్

పెదబయలులో జరిగిన కార్యక్రమంలో పాడేరు ఏడీఎంహెచ్‌వో డాక్టర్ టి.ప్రతాప్ మాట్లాడుతూ గర్భిణులు ఆస్పత్రిల్లోనే ప్రసవాలు చేసుకోవాలని, హిమోగ్లోబిన్ స్థాయి తగ్గకుండా మంచి ఆహారం తీసుకోవాలని సూచించారు. హిమోగ్లోబిన్ స్థాయి తక్కువగా ఉన్నవారికి సికిల్ సెల్ ఎనీమియా పరీక్షలు చేయించాలని వైద్య సిబ్బందిని కోరారు. డీపీహెచ్ఎన్‌ఓ బూలోకమ్మ, వైద్యాధికారి నిఖిల్, హెల్త్ సూపర్‌వైజర్ కృష్ణకుమారి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ముంచంగిపుట్టు: మండలంలోని జరిగిన కార్యక్రమంలో లబ్బూరు వైద్యాధికారి శ్యాంప్రసాద్, వైస్ ఎంపీపీ సిరగం భాగ్యవతి , వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

దుంబ్రిగుడ: మండలంలోని నిర్వహించిన కార్యక్రమంలో కిల్లోగుడ వైద్యాధికారి నజీబ్, జిల్లా డీఐవో సీహెచ్.కమల, సర్పంచ్ శారదా, అరకుల, సాగర ఎంపీటీసీలు వరహాలమ్మ, దేవదాసు, పీహెచ్ఎన్ జానకి, హెచ్‌వి పుష్ప సిబ్బంది పాల్గొన్నారు.

జి.మాడుగుల: మండలంలోని జరిగిన కార్యక్రమంలో డాక్టర్ చంద్ర, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చింతపల్లి: మండలంలోని జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ దురియా పుష్పలత, వైద్యాధికారులు సౌమ్య, రవీంద్రనాథ్ చౌదరి, ఎంపీటీసీ సభ్యులు దారలక్ష్మి, జయలక్ష్మి, ఎంపీహెచ్‌ఈవో జాన్సన్, టీబీ సూపర్‌వైజర్ ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

కొయ్యూరు: మండలంలోని జరిగిన కార్యక్రమంలో వైద్యులు హేమంత్, సీహెచ్‌వో ప్రశాంత్‌కుమార్, పీహెచ్ఎన్ భాగ్యవతి, హెచ్‌వీలు భూలోక, లక్ష్మి పాల్గొన్నారు.


మధురమామిడిలో ర్యాలీ నిర్వహిస్తున్న డాక్టర్ చంద్ర, వైద్య సిబ్బంది తదితరులు


సీలేరులో వైద్య శిబిరంలో సిబ్బంది తదితరులు

సీలేరు: సీలేరులో జరిగిన కార్యక్రమంలో డాక్టర్ మస్తాన్ వలి, డాక్టర్ బి.సృజనరాయి, ఎంపీటీసీ సభ్యుడు సాంబమూర్తి, సూపర్‌వైజర్ త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఎటపాక: గౌరిదేవిపేటలో నిర్వహించిన కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ పుల్లయ్య మహిళలకు ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. వైద్యులు దేవినాగ్, శ్రీదేవి, సర్పంచ్ ఉలవల శివకనకరాజు, నోడల్ అధికారి రమేష్, హెచ్‌వీ లక్ష్మి పాల్గొన్నారు.

చింతూరు: మండలంలోని జరిగిన కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కోటిరెడ్డి, వైద్య సిబ్బంది, నేత రమణారెడ్డి పాల్గొన్నారు.


మహిళలకు వైద్య సేవలందిస్తున్న సిబ్బంది


చిన్నగెడ్డలోని వైద్య శిబిరంలో మాట్లాడుతున్న సర్పంచ్ పుష్పలత


గౌరిదేవిపేటలోని సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ పుల్లయ్య


చింతూరు ప్రభుత్వాసుపత్రి వద్ద ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది

వైఎస్సార్‌సీపీ మరింత బలోపేతానికి కృషి


వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులతో అనంతబాబు, ప్రజాప్రతినిధులు, నాయకులు

వై.రామవరం: వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడిగా ముర్ల జోగిరెడ్డి, మండల యూత్ అధ్యక్షుడిగా కరణం కనకరాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండలంలోని తోటకూరపాలెం గ్రామంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ అనంతబాబు సమక్షంలో స్థానిక నాయకులు వారిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం వారిని అనంతబాబు శాలువా కప్పి సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పార్టీ మరింత బలోపేతానికి కృషి చేయాలని కోరారు. ఎంపీపీ కడబాల ఆనందరావు, జెడ్పీటీసీ సభ్యురాలు కర్ర వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీ వలాల విశ్వమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు వీరమళ్ల సుబ్బలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థికి గాయాలు


ప్రమాదంలో గాయపడిన విద్యార్థి

జి.మాడుగుల: స్థానిక ఏకలవ్య పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న విద్యార్థి పాంగి వినయ్‌కుమార్‌ను బుధవారం ఉదయం కారు ఢీ కొట్టింది. ఈ సంఘటనలో విద్యార్థి కుడికాలు విరిగిపోయింది. పాడేరు ప్రభుత్వ ఆస్పత్రిలో విద్యార్థికి వైద్యం అందిస్తున్నారు. చింతపల్లి మండలం చౌడుపల్లి పోస్టు గంతరాయి గ్రామానికి చెందిన విద్యార్థి తండ్రి చందుబాబుకు ఈ విషయం పాఠశాల యాజమాన్యం సమాచారం అందించడంతో వచ్చినట్టు ఆయన చెప్పారు. తన కుమారుడు కాలకృత్యాలు ముగించుకొని వస్తుండగా కారు ఢీ కొందని, ఈసంఘటనలో కాలు విరిగి పోయిందని వాపోయారు. తమ కొడుకుసకు మెరుగైన వైద్యం అందించాలని ఆయన కోరారు. ప్రమాదం చేసిన వ్యక్తిపై చట్టపరమైన చర్యలు చేపట్టాలని ఎస్ఎఫ్ఐ నాయకుడు జీవన్ డిమాండ్ చేశారు.ఈ ప్రమాద సంఘటనపై పోలీసులకు ఫిర్యాదు అందాల్సి ఉంది.

అంతరిక్ష పరిశోధనలపై అవగాహన


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ భరత్ కుమార్ నాయక్

అరకులోయటౌన్: ప్రధాని మోదీ జన్మదినం పురస్కరించుకొని వికాస్ దివాస్‌లో భాగంగా స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్పేస్ రెవల్యూషన్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భరత్ కుమార్ నాయక్ మాట్లాడారు. 2014 నుంచి ఇప్పటి వరకు భారత దేశ అంతరిక్షంలో జరిగిన అభివృద్ధి గురించి వివరించారు. భౌతికశాస్త్ర అధ్యాపకుడు ఎల్.ఎం.ఎస్.గణేష్ మాట్లాడుతూ పి.ఎస్.ఎల్.వి, జి.ఎస్.ఎల్.వి.లాంచింగ్ వెహికల్స్, శాటిలైట్ టెక్నాలజీ గురించి వివరించారు. భారత ప్రభుత్వం నిర్వహిస్తున్న స్పేస్ పోటీల్లో పాల్గొవాలని సూచించారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.కొండబాబు, ఎన్ఎస్ఎస్ పీఓలు వై.విజయలక్ష్మి, పి.నాగబాబు, ఎం.అనితకుమారి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తెగుళ్ల నివారణకు సూచనలు


అవగాహన కల్పిస్తున్న ఏవో గిరిబాబు

గూడెంకొత్తవీధి: మండలంలోని తీమలగుంట, మాడెం గ్రామాల్లో ఏవో గిరిబాబు ఆధ్వర్యంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. వరికి సోకే అగ్గి తెగుళ్లపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన అగ్గి తెగులు నివారణకు వీలుగా ట్రైసైక్లోజ్ మందును వరికి పిచికారీ చేయాలని సూచించారు. యూరియాను ఎక్కువ మోతాదులో వినియోగించొద్దన్నారు. ప్రతీ రైతు ఈ పంటను నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త డి.జి.వెంకటేశ్ బాబు మాట్లాడుతూ జీవ నియంత్రణ ఎరువుల వాడకంపై అవగహన కల్పించారు. రసాయన ఎరువులను తక్కువగా వాడాలని కోరారు.

రహదారి పనులకు శంకుస్థాపన


శంకుస్థాపన చేస్తున్న ఎంపీటీసీ సుబ్బలక్ష్మి, నేతలు

ముంచంగిపుట్టు: మండలంలోని ఏనుగురాయి పంచాయతీ సెల్లుమ్ గ్రామం నుంచి మజ్జిగూడ గ్రామం వరకు రహదారి పనులకు సర్పంచ్ నరసింగరావు, ఎంపీటీసీ సభ్యురాలు మజ్జి సుబ్బలక్ష్మీ బుధవారం శంకుస్థాపన చేశారు. ప్రత్యేక పూజలు చేసి, కొబ్బరికాయలు కొట్టారు. రెండు గ్రామాలకు రహదాని నిర్మాణమైతే రవాణా కష్టాలు తీరుతాయని ఎంపీటీసీ సుబ్బలక్ష్మీ అన్నారు. సర్పంచులు రమేష్, లక్ష్మణ్, నాయకులు కొండలరావు, నారాయణ, శాస్త్రిబాబు, పద్మారావు, సన్యాసమ్మ, శ్రావణ్‌కుమార్, జయదేవ్, చిన్ని, సాధురాం, సతీష్ పాల్గొన్నారు.

వాడీవేడిగా మండల సమావేశం


మాట్లాడుతున్న ఎంపీపీ ఆనందరావు

వై.రామవరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశంవాడివేడిగా జరిగింది. ఎంపీపీ కడబాల ఆనందరావు అధ్యక్షతన జెడ్పీటీసీ సభ్యురాలు కర్ర వెంకటలక్ష్మి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు తెలియజేసే సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని అధికారులకు సూచించారు. అనంతరం ఎంపీపీ ఆనందరావు మాట్లాడుతు సమావేశానికి అన్ని ప్రభుత్వశాఖల అధికారులు పూర్తిస్థాయిలో హాజరు కాక పోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశానికి గైర్హాజరైన ఏటీడబ్ల్యూవోపై కలెక్టర్ దినేష్‌కుమార్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. పలు పాఠశాలలో నాడు-నేడు పనులు పూర్తి చేయకుండానే బిల్లుల అవకతవకలపై పంచాయతీరాజ్ జేఈపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వేరే ప్రాంతానికి బదిలీ అయిన ఆ శాఖాధికారిని పిలిపించి వివరణ ఇవ్వాలని పలువురు డిమాండ్ చేశారు. సమస్య పరిష్కరించకపోతే కలెక్టర్‌కు ఫిర్యాదుచేస్తామన్నారు. మండలంలోని పలుచోట్ల ఉపాధ్యాయులు లేని పాఠశాలల విషయంపై ఎంఈవో తాతబ్బాయి దొరను నిలదీశారు. అరకొర యూరియా పంపిణీపై ఏవో సుజాతను పలువురు సభ్యులు నిలదీశారు. వసతి గృహాల్లో చిన్న గుడ్లు సరఫరా చేస్తున్నా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ఎంఈవోను పలువురు సభ్యులు ప్రశ్నించారు. దీనిపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేయాలని ఎంపీపీ ఆనందరావు ఆదేశించారు. పలు గ్రామాలకు రహదారుల నిర్మాణానికి అటవీశాఖాధికారులు అడ్డంకులు తొలగించాలని డిమాండ్ చేశారు. వైస్ ఎంపీపీలు విశ్వమ్మ, జోగిరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు సుబ్బలక్ష్మి, వెంకటరమణ, సర్పంచ్‌లు, డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాసరాజు, తహసీల్దార్ వేణుగోపాల్, ఎంఈవో తాతబ్బాయి దొర పాల్గొన్నారు.

సారాతో ఒకరి అరెస్టు


సారాతో పట్టుబడిన నిందితుడు

కొయ్యూరు: 70 లీటర్ల సారాతో రేవళ్లకు చెందిన పిట్టం రాంబాబును మంగళవారం అరెస్ట్ చేసినట్టు ఎస్ఐ శంకర్‌రావు తెలిపారు. మండలంలోని రేవళ్ల గ్రామంలో సారా తయారు చేసి విక్రయిస్తున్నట్టుగా సమాచారం రావడంతో దాడి చేశామన్నారు. ఈ దాడిలో పాలిథిన్ కవర్లలో సారాను రవాణా చేస్తుండగా రాంబాబును పట్టుకొని, సారా స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ శంకర్‌రావు చెప్పారు. సారా తయారీ, విక్రయాలు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

ఆదివాసీ జేసీఏ నూతన కమిటీ ఎన్నిక

చింతూరు: ఆదివాసీ జేఏసీ మండల నూతన కమిటీ ఎన్నిక బుధవారం సెంట్రల్ కమిటీ సభ్యుడు మడివి నెహ్రూ ఆధ్వర్యంలో జరిగింది. కమిటీ చైర్మన్ పొడియం రామకృష్ణ, వైస్ చైర్మన్‌గా కుంజా శ్రీనుతో పాటు సీతారామయ్య, రాఘవయ్య, అర్జున్, మహేష్, నీలయ్య, మూర్తి, రమేష్, రాజులను సభ్యులుగా ఎన్నుకున్నారు.

విద్యార్థిని ఆచూకీ కోసం ఫిర్యాదు


అనిత

గూడెంకొత్తవీధి: నర్సీపట్నంలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న తమ కుమార్తె కిల్లో అనిత కనిపించడం లేదని తండ్రి సన్నిబాబు మంగళవారం విలేకరులకు తెలిపారు. పెదవలస పంచాయతీ బందవీదికి చెందిన అనిత నర్సీపట్నంలో చదువుతుందన్నారు. కళాశాల నుంచి తప్పిపోయిన రెండు రోజుల నుంచి ఫోన్ చేయలేదన్నారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. ఆచూకీ తెలిస్తే 93470 25908, 9392510224 నంబర్లకు సంప్రదించాలని కోరారు.

దసరా బోనస్ చెల్లించాలని డిమాండ్


పండుబాబు

పాడేరు రూరల్: గిరిజన సహకార సంస్థ హమాలీలకు దసరా బోనస్ తక్షణం చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి వి.పండుబాబు తెలిపారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ హమాలీలను ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందన్నారు.అరకొర వేతనాలతో హమాలీలు అవస్థలు పడుతున్నారని, బకాయి వేతనాలు అందజేయాలని, సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం


అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు, గ్రామస్తులు


జగ్గంపాలెంలో అవగాహన కల్పిస్తున్న సీడీపీవో ఆదిలక్ష్మి

ముంచంగిపుట్టు: మండలంలోని కించాపుట్టు, జర్జుల, జోలాపుట్టు, రంగబయలు పంచాయతీల్లోని కొత్తసింధిపుట్టు, రాములు, లబ్బూరు, లంభపోదర్ గ్రామాల్లో బుధవారం పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా పౌష్టికాహారంపై అంగన్‌వాడీలు అవగాహన ర్యాలీని నిర్వహించారు. గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన ఆహారం, జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. పౌష్టికాహారంతో ఆరోగ్యం చేకూరుతుందన్నారు. సీడీపీవో విమలకుమారి, కిలగాడ వైద్యాధికారి శిరీష, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పద్మారావు, సూపర్‌వైజర్ రాజేశ్వరి, కొండమ్మ, అంగన్‌వాడీలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

గంగవరం : గర్భిణీలు, బాలింతలు, కిశోర బాలికలు పోష్టకాహారాన్ని తీసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీవో సుచరిత ఆదిలక్ష్మి అన్నారు. పెద్దఅడ్డపల్లి, జగ్గంపాలెం అంగన్‌వాడీ కేంద్రాల్లో బుధవారం నిర్వహించిన పోషణ్ మహా కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 17 నుంచి అక్టోబర్ 16వ తేదీ వరకు 8వ రాష్ట్రీయ పోషణ మహా కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఎండపల్లి , జగ్గంపాలెం సర్పంచ్‌లు రామలక్ష్మి, లీలావతి , జియ్యంపాలెం ఉప సర్పంచ్ బోడి అబ్బాయి దొర , సూపర్‌వైజర్లు కుమారి, సీతి, తదితరులు పాలొన్నారు.

ఘనంగా ప్రధాని మోదీ జన్మదిన వేడుకలు


ముంచంగిపుట్టులోని సీహెచ్‌సీలో రోగులకు రొట్టెలు పంపిణీ చేస్తున్న బీజేపీ నేతలు


కొత్తవలసలో గ్రామస్తులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న నాయకులు

ముంచంగిపుట్టు/రంపచోడవరం/గంగవరం/ఎటపాక: భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదిన వేడుకలు బీజేపీ నేతలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. వాడవాడలా సేవా కార్యక్రమాలు నిర్వహించారు. చీరలు పంపిణీ చేశారు. ఆస్పత్రుల్లో రోగులకు పండ్లు, పాలు, రొట్టెలు అందజేశారు. కేక్ కట్ చేసి, స్వీట్లు పంచిపెటట్టారు. పలువురు నాయకులు మాట్లాడుతూ మోదీ చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ముంచంగిపుట్టులో నాయకులు సుబ్బారావు, నాగభూషణం , గంగవరంలో సర్పంచ్ కలుముల అక్కమ్మ, నాయకులు చిన్న నీలాలమ్మ , రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ సొళ్ల బొజ్జి రెడ్డి, నాయకులు కాశీ విశ్వనాథ రెడ్డి, దొర, సిద్దు, ఎటపాకలో నాయకులు పెరమయ్య , ప్రసాద్, జయమ్మ, తదితరులు, మారేడుమిల్లిలో రామకృష్ణరెడ్డి, సీతారామన్నదొర , రామ రెడ్డి, వాహిని తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీవోలు బాధ్యతల స్వీకరణ


జీకే వీధిలో ఎంపీడీవో రమణను అభినందిస్తున్న సిబ్బంది


ముంచంగిపుట్టు ఎంపీడీవో ధర్మారావు

ముంచంగిపుట్టు: స్థానిక ఎంపీడీవోగా కె.ధర్మారావు బుధవారం బాధ్యతలు సీకర్వించారు.పరవాడ మండల డిప్యూటీ ఎంపీడీవోగా పనిచేస్తున్న ధర్మారావుకు పదోన్నతి కల్పిస్తూ ముంచంగిపుట్టు ఎంపీడీవోగా నియమించారు. బాధ్యతలు స్వీకరించిన ఎంపీడీవో ధర్మారావుకు సిబ్బంది, పంచాయితీ కార్యదర్శులు శుభాకాంక్షలు తెలిపారు. ప్రసుత్తం ఇన్‌చార్జి ఎంపీడీవోగా పనిచేసిన సూర్యనారాయణమూర్తి స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఏవో కొనసాగుతున్నారు. నూతన ఎంపీడీవో ధర్మారావు మాట్లాడుతూ మండల ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ మండల అభివృద్ధికి పనిచేస్తానని, మండలవాసుల సహాయ సహకారాలు అందించాలని ఆయన కోరారు.

గూడెంకొత్తవీధి: ఎంపీడీవోగా బి.హెచ్.పి.రమణ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎంపీడీవోగా పనిచేసిన ఉమామహేశ్వరరావు ఉద్యోగ విరమణ చేశారు. అనంతరం ఏవోగా పనిచేస్తున్న ఇమ్మాన్యుయెల్‌కు ఇన్‌చార్జి ఎంపీడీవోగా బాధ్యతలు అప్పగించారు. తాజాగా ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించిన రమణకు ఏవో ఇమ్మాన్యుయల్, కార్యాలయ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.